అలాంటి పెళ్లిళ్లను ఎంతమాత్రం రిజిస్టర్ చెయ్యదు''.

''మీ అంకుల్ వాళ్ల పెళ్లి రిజిస్టర్ కాలేదనే కదా వీసా రిజెక్టయింది. అంత చదువుకున్నవాళ్లు.. వాళ్లకేలేని తెలివి మా గూడెమోళ్లకెలా వస్తుందని నేనూ అనచ్చు. కానీ, నేనొచ్చింది అందుక్కాదు సార్. మా పెళ్లి చెయ్యమని అడగడానికి!'' స్థిరంగా చెప్పాడు రామ్లా.

అతని మాటలు వింటుంటే విశ్వనాథ్ నోట మాటరాలేదు. ఎందుకంటే రామ్లా మాటలు నూరుపాళ్లూ నిజం. ఇప్పటికీ చదువుకున్నవారి ఇళ్లలోనే చాలా పెళ్లిళ్లు రిజిస్టర్ కావడం లేదు. తను దాన్ని గుర్తించడం మానేసి నేరమూ – శిక్షా అంటూ పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం వెయ్యబోయాడు. కానీ, ఒకే ఒక్క ప్రశ్నతో తను పిచ్చుకను కాదనీ.. అవసరమైతే బ్రహ్మాస్త్రంగానూ మారగలననీ నిరూపించుకున్నాడు రామ్లా. అలాంటివాణ్ని రెచ్చగొట్టడం మంచిది కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆలోచనే తప్ప ఆవేశం పనికిరాదు. అందుకే అట్నుంచి నరుక్కొచ్చి.. రామ్లాకు తన తప్పేమిటో అర్థమయ్యేలా చెయ్యాలనుకున్నాడు. రామ్లాను అనునయిస్తున్నట్టుగా అడిగాడు..

''అప్పుడెందుకు చేస్తామన్నారు? ఇప్పుడెందుకు వద్దంటున్నారు?''.

''మా గూడాల్లో ఆడపిల్ల పుట్టగానే ఎవరి భార్యో డిసైడై పోతుందార్!''.

రామ్లా ఉపోద్ఘాతం వినగానే అతను చెప్పబోతున్నదేమిటో అర్థమైనవాడిలా వివరించడం మొదలుపెట్టాడు విశ్వనాథ్.

''చూడు రామ్లా! తల్లి, తండ్రి, తోబుట్టువులు, పిల్లలు.. ఇలా కుటుంబాన్ని ఏర్పాటుచేసుకునే క్రమంలో భార్యాభర్తలను కూడా పుట్టుకతోనే నిర్ణయించేవారు. అలా చెయ్యడంవల్ల చిన్నప్పటినుంచీ వాళ్లు అరమరికలు లేకుండా పెరిగేవారు. అయినా అది అప్పటికాలానికి తగిన ఏర్పాటు. దాన్ని ఈ కాలంలో పాటిస్తాననడం తప్పు. కాలంతోపాటు మనం కూడా ముందుకు సాగాలి. కానీ, నువ్వు వెనక్కి వెళ్తానంటున్నావు. అందుకే పెద్దవాళ్లు వద్దంటున్నారు. మనసు తెలుసుకోకుండా మనువు చెయ్యడం తప్పని మీ తల్లిదండ్రులు అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. కనుకనే ఆ తప్పు మీరు చెయ్యకూడదని కోరుకుంటున్నారు. మరి చదువుకుంటూ సంస్కారవంతంగా ఎదుగుతూ కూడా నువ్వెందుకిలా పట్టుపడుతున్నావు?''.



అంతలోనే విశ్వనాథ్ ఫోన్ రింగైంది. అది రామ్లా వాళ్లమ్మ ఫోన్. అమ్మ ఫోన్ అని అర్థం కాగానే.. రామ్లా గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. అప్పటికే మెహక్ లేచి పరుగందుకోబోయింది. రామ్లా ఆమెను పట్టుకుని బలవంతంగా ఆపాడు.

పరిస్థితిని అర్థం చేసుకున్న విశ్వనాథ్..

''వాడిక్కడికి రాలేదమ్మా! వస్తే నేనే ఫోన్ చేస్తాను'' అని చెప్పి కట్ చేశాడు. తరువాత రామ్లా వైపు తిరిగాడు.

''చూశావుగా.. మీకోసం వాళ్లెంత బాధ పడుతున్నారో? అంతమందిని బాధపెట్టే పెళ్లి మీకిప్పుడు అవసరమా? వెళ్లి బుద్ధిగా చదువుకోండి. వయసొచ్చాక నేనే దగ్గరుండి పెళ్లి చేయిస్తాను. సరేనా?'' అన్నాడు.

అయినా రామ్లాలో ఏ కదలికా లేదు. కానీ, అతను ఏదో తీవ్రమైన ద్వైదీభావంలో కొట్టుమిట్టాడుతున్నాడనీ.. అదెలా చెప్పాలో తెలియక సతమతం అవుతున్నాడనీ విశ్వనాథ్‌కు తెలుస్తూనే ఉంది. అందుకే చిరునవ్వుతో అడిగాడు.

''ఏం.. నా మాటమీద నమ్మకం లేదా?''.

''నమ్మకం లేకపోతే ఎందుకొస్తాం సార్?'' అన్నాడు గానీ.. అసలు విషయాన్ని ఎలా చెప్పాలో పాలుపోనివాడిలా నీళ్లు నములుతూ ఉండిపోయాడు రామ్లా. అందుకే..

''మీకిప్పుడు పెళ్లి ఇంపార్టెంట్ కాదని అర్థమైంది కదా? ఇక వెళ్లి పడుకోండి'' అంటూ గెస్ట్ రూంవైపు చెయ్యి చూపించాడు విశ్వనాథ్.

వెంటనే కంగారుగా అన్నాడు రామ్లా..

''లేద్సార్! మీరు మా పెళ్లి చేసే వరకూ ఇక్కణ్నుంచి కదలం!''.

విశ్వనాథ్‌కు ఈసారి నిజంగానే కోపం వచ్చింది.

''ఇంకోసారి పెళ్లీగిళ్లీ అన్నావంటే.. పోలీసుల్ని పిలుస్తాను జాగ్రత్త!'' అన్నాడు గుడ్లురుముతూ..

రామ్లా బిక్కమొగం పెడుతూ చెప్పాడు..

''సార్.. తను వట్టి మనిషి కాద్సార్!''.

''అంటే?''.

''నెల తప్పింది''.

ఆ మాట వినగానే విశ్వనాథ్ నిరుత్తరుడయ్యాడు. సాలోచనగా తల పంకిస్తూ..

''ఓ.. అందుకా 'పెళ్లీ పెళ్లీ' అని పట్టుబడుతున్నావు?'' అన్నాడుగానీ.. అతనికో కొత్త అనుమానం కలిగింది.

అందుకే బుజ్జగిస్తున్నట్లుగా అడిగాడు..

''తప్పు జరిగిన మాట నిజం. దాన్ని సరిదిద్దడానికి పెళ్లి కూడా ఓ పరిష్కారమే! పైగా మీది ముందే నిర్ణయించిన పెళ్లి కదా! అయినా మీవాళ్లెందుకు వద్దంటున్నారు?''.

విశ్వనాథ్ మాటలకు బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టింది మెహక్. ఆమె నోటికి చెయ్యి అడ్డం పెడుతూ చెప్పాడు రామ్లా,

''ఇందులో నా తప్పేం లేద్సార్!''.